క్లుప్తంగా

సభ్యుల సంక్షేమానికి కృషి

ఖిలా వరంగల్: సంఘ సభ్యుల సంక్షేమానికి మరింతగా కృషి చేస్తామని, వార్షికంగా వచ్చే లాభాలను ప్రతీ సభ్యుడికి పంపిణీ చేస్తామని ఏకశిల సేవా సంఘం శివనగర్ అధ్యక్షుడు బుదారపు భాస్కర్ అన్నారు. వరంగల్ శివనగర్‌లోని ఆర్యవైశ్య భవనంలో ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ రాజేష్ అధ్యక్షతన సంఘం వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన సంఘం సభ్యులకు రూ.35వేల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు తెలిపారు. సాధారణ రుణం రూ.లక్ష ఇరవై వేలను సభ్యులకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వార్షికంగా వచ్చిన లాభాల నుంచి ప్రతి సభ్యుడికి రూ.5వేలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రధాన కార్యదర్శి శ్రీరాం రాజేష్ ప్రవేశ పెట్టిన వార్షిక లావాదేవీలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం నూతన పాలకవర్గ అధ్యక్షుడిగా వైట్ల మల్లేశం, ప్రధాన కార్యదర్శి శ్రీరాంరాజేష్, కోశాధికారి వాసం రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి మండలంలోని కేజీబీవీలో రెండు అసిస్టెంట్ కుక్ పోస్టుల నియామకానికి 7వ తరగతి విద్యార్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి రాంకిషన్‌రాజు ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 15 సాయంత్రం 5గంటల లోపు హసన్‌పర్తి ఏఈఓ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

జ్ఞాన యజ్ఞ సప్తాహం ప్రారంభం



హన్మకొండ అర్బన్: నగరంలోని ఏషియన్ శ్రీదేవి మాల్ సమీపంలోని సాయిబాబా మందిరంలో యజ్ఞానంద స్వామిజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్ఞాన యజ్ఞ సహప్తం కార్యక్రమాన్ని మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండకోపనిషత్‌పై యజ్ఞానంద చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. వారం రోజులపాటు జరగనున్న సప్తాహం కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మందిరం ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, వెయ్యిగండ్ల రమేష్, పూస సురేష్‌కుమార్, బ్రహ్మచారిని లతికాచైతన్య, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

హసన్‌పర్తి: గానకోకిల అవార్డు అందుకున్న హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన పిట్టల భవానిని ఆదివారం సన్మానించారు. ఈమేరకు ఆమెను సుబేదారిలోని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాగరాజు అభినందించారు.


బోనాలకు రావాలని ఆహ్వానం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలో ఈనెల 17న జరగనున్న బీరన్న బోనాలకు రావాలని జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జి కంచ ప్రసాద్‌ను కోరారు. ఈమేరకు ఆయన స్వగృహంలో బీరన్న ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. జడ్జిని కలిసిన వారిలో మండల సీతారాములు, మండల ప్రభాకర్, రాములు, కంచ మల్లయ్య, రవి, నరసింహరాములు, సాంబయ్య, రమేష్, రాజు ఉన్నారు.

నియామకం

హసన్‌పర్తి: ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గట్టు యుగంధర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శేషగిరిరావు ప్రకటించి ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నోట్ బుక్స్ పంపిణీ



దేశాయిపేట: పేదరికంపై యుద్ధం చేసేందుకు చదువే ప్రధాన ఆయుధమని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. ఆరెపల్లి సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల కళాశాలలో 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ప్రజ్ఞాపాటవాలు గల 30మంది విద్యార్థులకు తెలంగాణ చరిత్ర, ఎకనామిక్స్, జీకే పుస్తకాలను స్కూల్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ పిల్లలకు పోటీతత్వం అనేది చిన్ననాటి నుంచే అలవాటు చేయాలని సూచించారు. గ్రూప్స్ ప్రవేశ పరీక్షలకు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత కోచింగ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర నాయకులు ఎస్.రామకృష్ణ, డి.చిరంజీవి, ఎస్.రాజు, శ్యామ్, జిల్లా నాయకుడు రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే..చిత్తడే



3వ వార్డు మసీదుకు వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



బురదమయమైన చింతలపల్లికి వెళ్లే రోడ్డు

- గుంతలమయంగా మసీదు రోడ్డు
- బురదమయంగా ఎస్‌బీఐ నుంచి చింతలపల్లికి వెళ్లే రోడ్డు
- మరమ్మతు చేయాలని కాలనీవాసుల డిమాండ్

ఎల్కతుర్తి : చినుకుపడితే చాలు.. రోడ్లన్ని చిత్తడిగా మారుతున్నాయి. గుంతల్లో వర్షపు నీరు నిలిచి బురదమయంగా ఉండడంతో ప్రయాణికులు, వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లోని రోడ్లు చిన్నపాటి వర్షానికి చిత్తడిగా మారి వాహనాలు, కాలనీల వాసులు నడవలేకుండా మారింది. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి మూడో వార్డులోని మసీదుకు వెళ్లే రోడ్డు పూర్తిగా బురదమయంగా మారడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి. మసీదులో ప్రార్థనకు సుమారు 100 మంది నిత్యం వస్తుంటారు. అలాగే కాలనీవాసులు సైతం అదే రోడ్డు గుండా వెళ్లాలంటే జంకుతున్నారు. వర్షం కురిసినప్పుడల్లా రోడ్డంతా చిత్తడిగా మారుతోంది. అంతే కాకుండా రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలిచి దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి. నిత్యం వాహనాల రాకపోకలతో వర్షపు నీరంతా దుర్వాసన వెదజల్లుతోందని కాలనీవాసులు వాపోతున్నారు.

అలాగే బీసీ కాలనీలోని పాత గ్రామపంచాయతీకి వెళ్లే రోడ్డు సైతం బురదమయంగా మారడంతో వాహనాల టైర్లు అదుపు తప్పుతున్నాయి. ఇటీవలే ఇద్దరు వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయపడ్డారు. స్థానిక ఎస్‌బీఐ నుంచి దామెర, చింతలపల్లికి వెళ్లే మార్గంలో సుమారు 100 మీటర్ల పొడవు రోడ్డంతా గుంతలుగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడుతోంది. అలాగే వర్షపు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చిత్తడిగా ఉన్న రోడ్ల వెంబడి నీరు నిల్వకుండా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. వీలైతే ఆయా మార్గాల్లో సీసీ రోడ్లు నిర్మించి శాశ్వత ఇబ్బందులు తొలగించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డుపై మొరం పోయించాలి



కాలనీలోని రోడ్లన్ని చినుకుపడితే చిత్తడిగా మారుతున్నాయి. దీంతో దారిగుండా నడవలేక పోతున్నాం. మసీదుకు వచ్చే ముస్లింలు సైతం వాహనాలు అదుపు తప్పి గుంతల్లో పడిపోయి గాయపడుతున్నారు. గుంతల్లో నీరు నిలవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. కాలనీవాసులు రోగాల బారిన పడకముందే అధికారులు స్పందించి రోడ్డుపై మొరం పోయించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి. -పెరుకు మధుసూదన్, స్థానికుడు

సీసీ రోడ్డు నిర్మించాలి



ఎల్కతుర్తిలోని ఎస్‌బీఐ నుంచి చింతలపల్లి, దామెరకు వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షం కురిసినప్పుడల్లా గుంతల్లో నీరు నిలిచి రోడ్డు బురదమయంగా మారి వచ్చి, పోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా వాహనాలు గుంతల్లో పడడంతో పలువురు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డు లేదా బీటీ రోడ్డు నిర్మించాలి. - గబ్బేటి ప్రకాశ్

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న బండి సంజయ్

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామానికి చెందిన గోదెల సంపత్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కాగా కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంపత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, జన్నపు రెడ్డి సురేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు పైడిపెల్లి పృథ్వీరాజ్, కుడితాటి చిరంజీవితో పాటు తదితరులు ఉన్నారు.

పట్టుతప్పితే.. ప్రాణాలు గోవిందా..



లారీ క్యాబిన్‌పై కూర్చుని వెళ్తున్న హమాలీలు

శాయంపేట : పట్టుతప్పిందా.. ప్రాణాలు గాల్లోనే కలిసిపోతాయి..ఇంత నిర్లక్ష్యంగా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు, హమాలీ కార్మికులు. రైస్ మిల్లులకు తరలించేందుకు లారీల్లో ధాన్యం లోడు చేసిన హమాలీలు పట్టుతప్పి పడితే ప్రమాదమని తెలిసి లారీ క్యాబిన్‌పై కూర్చుని ప్రయాణిస్తున్నారు. ఆదివారం ఓ లారీ క్యాబిన్‌పై హమాలీలు కూర్చొని ప్రయాణించడాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని ఆరెపల్లిలోని ప్రభుత్వ గోదాంలో నిల్వ చేసి ఆ ధాన్యాన్ని రైస్ మిల్లుకు తరలిస్తున్నారు. ఇందులో భాగంగా మిల్లర్లు హమాలీలకు ప్రత్యేక సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉండగా వాటిని పట్టించుకోకపోవడంతో హమాలీలు ల్యారీ క్యాబిన్ పైన ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట నుంచే ప్రయాణిస్తున్న వారు సైతం అటు వైపు దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా పోలీసులతో పాటు, రవాణా శాఖ అధికారులు పట్టించుకుని హమాలీలు క్యాబిన్ పైన వెళ్లకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేకల రవి

ఖిలా వరంగల్: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా కోరారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఎండీ.అక్బర్ పాషా అధ్యక్షతన ఆదివారం మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి ముక్కుతాడు వేసేలా గట్టి ప్రతిపక్షం ఏర్పడిందని చెప్పారు. గతంలో మాదిరిగా మోదీ నిరంకుశ, నియంతృత్వ పాలనకు కాలం చెల్లిందని ఎద్దేవాచేశారు. దేశంలో మతం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్న ఎన్డీఏ ఆగడాలను అరికట్టేందుకు వామపక్ష లౌకిక శక్తులను కాంగ్రెస్ కలుపుకొనిపోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, ఎలేందర్, సౌందర్య, భవాని, తీగల కుమార్, యాకూబ్, రవి, రాజేందర్, ఎండీ.నవాంబీ, విజయలక్ష్మి, సువర్ణ, దివ్య, కుమార్, ప్రభాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

దామెర : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం గుడెప్పాడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరునొకరు పలకరించుకొని తమ తీపి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు మురళి, రాజు, ప్రవీణ్, శ్రీకాంత్, సత్యం, ఓదెలు, రాధిక, రేణుక, రవీనా, సుష్మ, ప్రశాంతి, సునీల్, రాజు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత



పూడ్చిన గుంతను పరిశీలిస్తున్న ఎస్సై అశోక్

దామెర : మండలంలోని వెంకటపూర్ గ్రామంలోని రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంతలను ఎస్సై అశోక్ పరిశీలించి పూడ్చివేయాలని స్థానికులను ఆదేశించారు. దీంతో మాజీ సర్పంచ్ పున్నం సంపత్, స్థానికులు పొక్లెయినర్‌తో గుంతలను పూడ్చివేశారు. అనంతరం సంపత్‌ను, స్థానికులను ఎస్సై అశోక్ అభినందించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు ఎస్సై అశోక్ సూచించారు.

ఔషధ మొక్కల పంపిణీ



ఔషధ మొక్కలు పంపిణీ చేస్తున్న రమేష్

హసన్‌పర్తి: చింతగట్టులోని మహర్షి గోశాలలో ఔషధ మొక్కలను ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. తులసీ, తిప్పతి, సజ్జ, నల్లేరు మొక్కలను పలువురికి అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గోశాల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సర్జన రమేష్ మాట్లాడుతూ ఔషధ మొక్కలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. ప్రతి ఇంటిలో ఇలాంటి మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు స్వామి నారాయణ, డి.కిషన్, కె.యాదగిరి, రాజమణి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం

ఖిలా వరంగల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలని యోగా గురువు పోశాల శ్రీనివాస్ సూచించారు. హనుమకొండ శ్రీదేవి ఏషియన్ మాల్‌లో యోగా అభ్యాసం చేస్తున్న సాధకులు.. వన్ క్లబ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం ఖిలా వరంగల్ రాతికోటపై హరిత యోగా శిబిరం ఆధ్వర్యంలో ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ యోగాతో దీర్ఘకాలిక రుగ్మతలైన బీపీ, షుగర్, అల్సర్, ఆస్తమా, తీవ్రమైన నొప్పులు, నడుం నొప్పులు తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో యోగా సాధకులు శ్రీనివాస్, వేణు, శ్రీకాంత్, డాక్టర్ మమత, లిఖిత, రాజయ్య, హయగ్రీవాచారి, చిన్నారులు పాల్గొన్నారు.

ఘనంగా బీరన్న బోనాలు



ఆత్మకూరు : మండల కేంద్రంలోని బీరన్న ఆలయంలో యాదవులు ఆదివారం బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మండల కేంద్రంతో పాటు గుడెప్పాడ్, తిరుమలగిరి గ్రామాల్లోను గొల్ల కురుమలు బీరన్న ఆలయానికి డప్పు చప్పుళ్లతో చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. పిల్లాపాపలను సల్లగా చూడాలని వారు ప్రత్యేక పూజలు చేశారు.

హామీలు వెంటనే అమలు చేయాలి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



ఖిలావరంగల్: తిమ్మాపురం బెస్తం చెరువు వద్ద..

వేలేరు : కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆ సంఘం నాయకుడు ఇట్టబోయిన భూపతిరాజు డిమాండ్ చేశారు.ఆదివారం వేలేరు మండల కేంద్రంలో ముదిరాజ్ మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని, చెరువులు, కుంటలపై ముదిరాజ్‌లకే హక్కులు ఉండే విధంగా చట్టపరమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల అభివృద్ధికి తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని, 50 ఏళ్లు నిండిన ముదిరాజ్‌లకు ఆసరా పింఛన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు సంపత్, ఆళ్ల రమేష్, యాదగిరి, తిరుపతి, సంపత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ' లోకి మార్చాలి

ఖిలా వరంగల్ : ముదిరాజ్‌లను బీసీ 'డీ' నుంచి బీసీ 'ఏ' లోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన అశోక్ డిమాండ్ చేశారు. ముదిరాజ్ మహాసభ వాల్‌పోస్టర్లను వరంగల్ తిమ్మాపురం బెస్తం చెరువు వద్ద ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ హనుమకొండ జిల్లా కార్యదర్శి పులి రజనీకాంత్, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు చొప్పరి సోమయ్య, మండల నేత ఉమేష్, బుస్సా వెంకన్న, సూరయ్య, డైరెక్టర్ రాజు, రమేష్, మోహన్, అల్లీపూర్ గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్షుడిని సత్కరించిన యూత్ సభ్యులు

కమలాపూర్ : మండల కేంద్రంలో ప్రగతి యువజన సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలసాని చిన్న కుమారస్వామి గౌడ్, ఉపాధ్యక్షులుగా తోడేటి సుందర్, పబ్బు జగన్, ప్రధాన కార్యదర్శిగా పబ్బు అశోక్ గౌడ్, సహాయ కార్యదర్శిగా పచ్చిమట్ల రాజేందర్, కోశాధికారిగా కొండి కరుణ్, గౌరవ అధ్యక్షుడిగా బాలసాని దేవేందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పబ్బు సతీష్‌గౌడ్, తాళ్ల నవీన్, పచ్చిమట్ల కుమారస్వామి, పబ్బు లక్ష్మణ్, మండ చరణ్ గౌడ్, ఈటల రమేష్, తోడేటి అశోక్, తోడేటి కుమార్, పబ్బు క్రాంతి, పులికంటి ప్రభాకర్, దుంపల సతీష్, బూడిద సురేందర్, బాలసాని హరీష్‌ను ఎన్నుకున్నారు.

మార్కండేయ గణపతి సంఘం..



ఎన్నికైన నూతన కార్యవర్గం

వేలేరు : మండల కేంద్రంలోని పద్మశాలి భవనంలో మార్కండేయ గణపతి సంఘం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా గజ్జెల్లి రాజు, ఉపాధ్యక్షు డిగా మంద రవీందర్, ప్రధాన కార్యదర్శిగా కూరపాటి శ్రీనివాస్, కోశాధికారిగా కూరపాటి సురేష్, సభ్యులుగా విజయ్‌కుమార్, ప్రసాద్, వేణు, మల్లేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బిల్లా యాదగిరి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీరీల ఊరేగింపు



పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు

శాయంపేట : మండల కేంద్రంలోని ముస్లింలు పీరీలను ఆదివారం ఊరేగించారు. ప్రతి వాడ వాడకు తిరుగుతూ ప్రజలను దీవించారు. ఈ సందర్భంగా మత పెద్ద షఫి మాట్లాడుతూ.. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను వేడుకున్నట్లు తెలిపారు. ఈ నెల 17న మొహర్రం సందర్భంగా భక్తి శ్రద్ధలతో మూడు రోజుల పాటు పీరీలతో గ్రామంలో ప్రతి ఇంటింటి తిరుగుతామని తెలిపారు.

డ్రెయినేజీ కాదండోయ్.. డివైడరే



అంబేడ్కర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన డివైడర్‌లో నిలిచిన మురుగు నీరు

ఈ ఫొటోలో కనిపిస్తున్నది సైడ్ డ్రెయినేజీ అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్లే.. ఇది రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్.. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ఏర్పాటు చేసిన డివైడర్ ఇది. ప్రధాన రోడ్డు వెంట సైడ్ డ్రెయినేజీ లేక రోడ్డు ప క్కన ఉన్న ఇళ్లలోని వారు వాడిన నీరంతా రోడ్డుపై పారుతూ డివైడర్‌లో నిల్వ ఉంటుంది. దీంతో దుర్వాసన, ఈగలు, దోమలు చేరి ప్రజలు రోగాల బారిన పడుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చే స్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ కావడంతో డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలే ప్రమా దం ఉందని ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారి సమస్యలను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డ్రెయినేజీ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - వేలేరు

గాంధీనగర్‌లో 'స్వచ్ఛ భారత్'



వీధుల్లో శుభ్రం చేస్తున్న కమిటీ సభ్యులు

హన్మకొండ: హనుమకొండలోని గాంధీనగర్‌లో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. గాంధీనగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకట రాజిరెడ్డి ఆధ్వర్యంలో కాలనీలోని వీధులను శుభ్రం చేశారు. వీధులకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా వెంకట రాజిరెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు సూచించారు. పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని చెప్పారు. ఇంటిలోని వ్యర్థాలను రోడ్లపై వేయకుండా చెత్త బుట్టలో వేసి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన చెత్త సేకరణ వాహన డ్రైవర్‌కు అందించాలన్నారు. కార్యక్రమంలో గాంధీనగర్ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి సట్ల సత్తయ్య, ఉపాధ్యక్షుడు ఎం.వీరేందర్, కోశాధికారి గోపగాని అశోక్, కాలనీవాసులు మల్లారెడ్డి, జనార్దన్ రెడ్డి, శ్యాంప్రసాద్, కొండల్ రెడ్డి, అశోక్ రెడ్డి, రాజిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోల్కొండ శ్రీనివాస్, శానిటరీ జవాన్ పవన్, తదితరులు పాల్గొన్నారు.